సాక్షి ఒడిశా

శుక్రవారం । 14 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,09,189లు, బంగారం 2 గ్రాముల 290 మిల్లీగ్రాములు, వెండి 23 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఎట్టకేలకు..!

దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత బుధవారం సాయంత్రం వివిధ మీడియా సంస్థల జర్నలిస్టులను వార్తలను కవర్ చేసేందుకు లోక్‌సేవ భవన్‌లోకి అనుమతించారు.

- 8లో



రొజ్జొ సందడి ప్రారంభం

మహిళల పండగ రొజ్జొ సందడి గురువారం ఆరంభమైంది.

- 8లో

న్యూస్‌రీల్

గంజాయితో పట్టుబడిన యువకుడు



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: స్థానిక రైల్వే ప్లాట్‌ఫారంలో రైల్వే పోలీసులు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒక యువకుడిని అరెస్టు చేశారు. అతని నుంచి రూ.2.20 లక్షలు విలువ చేసే 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించి రైల్వే డీఎస్పీ నిరంజన్ పాఢి తెలియజేసిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం ఒక యువకుడు అనుమానస్పదంగా కనిపించడంతో అతని బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. కొరాపుట్ నుంచి గంజాయిని తీసుకొచ్చి ట్రైన్‌లో పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌ఘడ్‌కు తరలించేందుక రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆ యువకుడిని పట్టుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతరాష్ట్ర సమస్యలు పరిష్కరించండి

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక



కొరాపుట్: రాష్ట్రంలో పూర్తిస్థాయిలో బీజేపీకి బలం ఉన్నందున అంతరాష్ట్ర సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉలక గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాల్లో వారే అధికారంలో ఉన్నందున రాష్ట్ర సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాల సమస్య కొఠియాని పరిష్కరించాలన్నారు. కొఠియా ప్రాంతం సప్తగిరి ఉలక నేతృత్వం వహిస్తున్న కొరాపుట్ పార్లమెంటరీ స్థానం పరిధిలోనిది కావడం గమనార్హం. అలాగే ఛత్తీష్‌గడ్-ఒడిశా రాష్ట్రాల మధ్య సమస్యగా ఉన్న మహానది విషయంలో కూడా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్టానికి ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ సాధించాలని సూచించారు.


రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం



రోడ్డు మధ్యలోనే ఉన్న విద్యుత్ స్తంభం

కొరాపుట్: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోతే ప్రజలే ఇబ్బందులు పడతారు. ఇటువంటి సంఘటన నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి దమనాగుడ గ్రామ పంచాయతీ అర్చితాగుడలో చోటు చేసుకుంది. అక్కడ పీబ్ల్యూడీ విభాగం రోడ్డు నిర్మాణం చేపడుతోంది. కానీ రోడ్డుకి అడ్డంగా 7 విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. దీంతో వాటిని వెనక్కు మరల్చాలని గ్రామస్తులు విద్యుత్ శాఖకి వినతులు అందజేశారు. కానీ సంబంధిత శాఖ నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా రోడ్డు నిర్మాణంలో జాప్యం ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో చివరకు గత్యంతరం లేక స్తంభాలు ఉంటుండగానే రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ మార్గంలో జొరిగాం-చందాహండి సమితులకు నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రివేళ ఈ మార్గంలో వాహనదారులు స్తంభాలు వలన ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగితే స్థానికంగా తామ ఇబ్బందులు పడతామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

'నిధుల వివరాలు తెలపండి'



మాట్లాడుతున్న శ్రీనివాసరావు తదితరులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని గొడిగూడ గ్రామం వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఎయిర్‌పోర్టు కోసం ఖర్చు చేసిన రూ.80 కోట్ల నిధుల వివరాలు తెలియజేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. నిధులను కాంట్రాక్టర్లు, ఆర్‌డీ అధికారులు స్వాహా చేయడం వలనే నిర్మాణాల్లో నాణ్యత లేకుండా కూలిపోతున్నాయని ఆరోపించారు. మంజూరైన నిధుల వివరాలు 15 రోజుల్లోగా తెలపాలన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గోవిందపాత్రో తదితరులు ఉన్నారు.

ఎన్నాళ్లో.. వేచిన ఉదయం..!



వ్యాఘ్ర ద్వారం



శ్రీమందిరం ప్రాకార ప్రదక్షిణలో సీఎం మోహన్ చరణ్ మాఝి తదితరులు

- తెరుచుకున్న శ్రీమందిరం నాలుగు ద్వారాలు
- భక్తులకు సులభ దర్శన సౌకర్యం
- నూతన మంత్రి మండలి సమక్షంలో చర్యలు

భువనేశ్వర్: ఎట్టకేలకు రాష్ట్ర ప్రజలు సుదీర్ఘ డిమాండ్‌కు పరిష్కారం దొరికింది. రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం శ్రీమందిరం నాలుగు ద్వారాలను తెరిచింది. దీంతో శ్రీజగన్నాథ స్వామివారి సులభ దర్శనానికి మార్గం సుగమం అయింది. భక్తులు మూల విరాటులను దర్శించుకోవడానికి దేవాలయంలోని నలువైపులా నాలుగు ద్వారాలను గురువారం ఉదయం రాష్ట్ర మంత్రి మండలి సమక్షంలో తెరిచారు. బుధవారం మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వ తొలి మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. భక్తుల మనోభావాలు దృష్ట్యా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా, రాష్ట్ర మంత్రి మండలి సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమక్షంలో ఈరోజు భక్తుల కోసం ఆలయం నలువైపుల ద్వారాలు తలుపులు తెరిచారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీజగన్నాథుడిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు ఆకాంక్షించినట్లు తెలిపారు.

అసౌకర్యాన్ని తొలగించేందుకు

పూరీలో విపరీతమైన రద్దీ మధ్య శ్రీమందిర్‌లో మూల విరాటుల దర్శనం కోసం తలెత్తుతున్న అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీమందిరం నాలుగు వైపుల ద్వారాలను తెరవాలని నిర్ణయించడం జరిగిందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. ఈ చర్య బీజేపీ ఎన్నికల హామీల్లో ఒకటిగా పేర్కొన్నారు. మంత్రి మండలి తీర్మానం ప్రకారం గురువారం ఉదయం మంగళ హారతి తర్వాత 4 ద్వారాల గుండా భక్తుల రాకపోకలను అనుమతించారు. దీంతో రద్దీ లేకుండా సాఫీగా దర్శనం పొందేందుకు వీలవుతుందన్నారు.

- కోవిడ్ ప్రభావంతో మూసివేత


కోవిడ్ -19 మహమ్మారి సమయంలో ప్రాచీన శ్రీజగన్నాథ దేవస్థానం ద్వారాలు మూసివేశారు. తర్వాత సింహద్వారం మాత్రమే భక్తుల కోసం తెరిచి, మిగతా ద్వారాలు తెరవకుండా ఇప్పటివరకు కాలక్షేపం చేశారు. మిగిలిన మూడు ద్వారాల తలుపులు - అశ్వ (గుర్రపు) ద్వారం, వ్యాఘ్ర (పులి) ద్వారం మరియు హస్తి (ఏనుగు) ద్వారం కోవిడ్ మొదలుకొని నిరవధికంగా మూసి వేశారు. నిత్యం తండోపతండాలుగా తరలి వచ్చే భక్తులు, యాత్రికులు కేవలం సింహద్వారం గుండా మాత్రమే ప్రవేశించాల్సి రావడంతో కొన్నిసార్లు రద్దీ నియంత్రణ అదుపు తప్పి ఇబ్బందులకు గురయ్యారు. శ్రీ మందిరం సింహద్వారం తూర్పు దిశలో బొడొ దండొకు అభిముఖంగా ఉంటుంది. రథయాత్ర పురస్కరించుకుని చతుర్ధామూర్తుల మూల విరాటులు ఇతర సందర్భాల్లో ఉత్సవమూర్తులు ఈ ద్వారం గుండా వెలుపలకి వచ్చి లోనికి ప్రవేశించడం జరుగుతుంది. మిగిలిన మూడు ద్వారాలు శ్రీ మందిరం దక్షిణం, పడమర మరియు ఉత్తరం వైపున ఉన్నాయి. దక్షిణాన అశ్వ ద్వారం, పశ్చిమ దిక్కున వ్యాఘ్ర (పులి) ద్వారం మరియు ఉత్తరాన హస్తి (ఏనుగు) ద్వారం ఉన్నాయి. ఈ ద్వారాల ముంగిట రక్షణగా రూపుదిద్దుకున్న జంతువుల శిల్పాల ఆధారంగా వాటిని ఇలా వ్యవహరిస్తారు. స్థానిక సంప్రదాయం ప్రకారం నాలుగు ద్వారాలు నాలుగు వర్గాల ప్రతీకగా కొనియాడతారు. ధర్మం (సింహం), అర్థ (ఏనుగు), కామ (గుర్రం), మోక్షం (పులి)ని సూచిస్తాయి. ఈ నాలుగు ద్వారాలు ధర్మం (సరైన ప్రవర్తన), జ్ఞాన (జ్ఞానం), వైరాగ్య (పరిత్యాగం), ఐశ్వర్యం (శ్రేయస్సు) యొక్క నాలుగు ప్రాథమిక సూత్రాలను వరుసగా తూర్పు, దక్షిణం, పడమర మరియు ఉత్తరం దిశలో ద్వారాలు సూచిస్తాయని మరొక సంప్రదాయం వివరిస్తుంది.



శ్రీమందిరం సింహద్వారం



అశ్వద్వారం



హస్తి ద్వారం

ప్రకృతి విపత్తులను.. సమర్థవంతంగా ఎదుర్కోవాలి



పర్లాకిమిడి: సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

- రాయగడ కలెక్టర్ మహాజన్

రాయగడ:

వర్షాకాలంలో అనుకోకుండా ఎదురయ్యే ప్రాకృతిక విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేవిధంగా జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో వర్షాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నదీతీర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరుచుకునే వారిపై దృష్టి సారించాలని సూచించారు. ఈనెల 18వ తేదీన జిల్లా కేంద్రంతో పాటు జిలాలోని అన్ని సమితి కేంద్రాల్లో ప్రాకృతిక విపత్తులను ఎదుర్కొనేవిధంగా తీసుకుంటున్న చర్యలకు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగేలా మాక్‌డ్రిల్ వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్, ఏడీఎం త్రినాథ్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడంపై ఈనెల 18, 19 తేదీల్లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎమర్జెన్సీ అధికారి ప్రదోష్ కుమార్ శతపతి మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలపై ఐఎండీ సూచనల మేరకు జిల్లాలో వివిధ సమితి అధికారులకు హెచ్చరికలు జారీ చేయడం జరుగుతుందన్నారు. మన దగ్గర ఉన్న మానవ వనరులు, ఓడ్రాఫ్‌తో వరదలు, తుపాను, గాలి వానలు ఎలా ఎదుర్కోవాలో కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఆర్.సెట్టి కేంద్రం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఎస్పీ స్వాతి కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.ఆనంద్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పీవో దిలీప్ కుమార్ పాల్గొన్నారు.



రాయగడ: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

ఎంజే సినీప్లెక్స్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ కమలోచన్ మిశ్ర



హాజరైన ప్రజలు, వార్డు కౌన్సిలర్లు

కొరాపుట్: రాష్ట్రంలో చివరి పురపాలక సంఘం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలో ఎంజే సినీప్లెక్స్‌ని కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర గురువారం ప్రారంభించారు. పట్టణంలో రెండో నంబర్ వార్డులోని గట్టిగుడలో ప్రారంభ పూజలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మర్‌కోట్ జిల్లా ఆర్థిక కేంద్రమని అభివర్ణించారు. ఇక్కడ వర్తక, వాణిజ్య రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి రంగాల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ, సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాధా బోత్ర, మాజీ చైర్మన్ రమణారావు, బీడీవో ప్రీతి రంజన్ రథ్, తహసీల్దార్ మెగవాన్ బాగ్, మున్సిపల్ ఈవో బనమాలి సత్పతి, 14 వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జ్వరమొచ్చింది..!

- కాసీపూర్ సమితిలో ప్రబలుతున్న విష జ్వరాలు
- వారం రోజుల్లో ముగ్గురు చిన్నారుల మృతి
- అప్రమత్తమైన వైద్య శాఖ
- బ్లడ్ శాంపిల్స్ సేకరణ



మునిషిపాదొరొ గ్రామం



గ్రామంలో వివరాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాదొరొలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. గత వారం రోజులుగా గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో వైద్య శాఖ అప్రమత్తమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 7వ తేదీన కడుపు నొప్పి, తీవ్రమైన జ్వరంతో గ్రామానికి చెందిన రాని మాఝి (12) అనే చిన్నారి మృతి చెందింది. అదేవిధంగా 9వ తేదీన నరేంద్ర మాఝి(6), 11వ తేదీన పూర్ణ మాఝి(8) అనే ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్య శాఖ మునిషిపాదొరొ గ్రామానికి వైద్య సిబ్బందిని పంపించింది. దీంతో రోగాలకు గల కారణాలను అన్వేషించే క్రమంలో వ్యాధితో బాధపడుతున్న వారి రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపించారు. ఇదిలాఉండగా అదే గ్రామానికి చెందిన పవిత్ర మాఝి(8), మహేంద్ర మాఝి (5), కలసి మాఝి (12), జయరాం మాఝి (5)లు వ్యాధి బారినపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

డిఫ్తీరియాగా అనుమానం

వ్యాధిగ్రస్తుల రక్త నమూనాలను సేకరించిన వైద్య శాఖ డిఫ్తీరియా వ్యాధిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వ్యాధి లక్షణాలు రోగుల్లో కనిపించడంతో ఆ దిశగా నివారణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తెలియజేసింది. జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రైత్రాయ్ బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అధ్యయనం చేశారు. అయితే వ్యాధి నివారణ దశలో ఉందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రస్తుతం గ్రామంలో వ్యాధి అదుపులో ఉందన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు



రోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సీడీఎంవో

క్లుప్తంగా

కిన్నెర సంఘం విస్తరణ



కిన్నెర సంఘం సభ్యులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కిన్నెర సంఘాన్ని జిల్లావ్యాప్తంగా విస్తరించారు. బుధవారం జిల్లా కేంద్రంలో గాంధీనగర్‌లోని తపోవన్ ఆశ్రమంలో కిన్నెరలు సమావేశమయ్యారు. తమ శాఖలను జిల్లాలో 10 సమితులు, 2 పురపాలక సంఘాలకు విస్తరించాలని నిర్ణయించారు. జిల్లా అధ్యక్ష స్థానంలో కాజల్ కిన్నెర, చైర్మన్‌గా సంఘ సేవకుడు మనోజ్ పట్నాయక్, న్యాయ సలహాదారుగా రాం పాత్రో, సలహాదారునిగా జగన్నాథ మహాపాత్రోలు ఎన్నికయ్యారు. సమాజంలో కిన్నెరలకు జరుగుతున్న అవమానాలపై స్వచ్ఛంద సేవకుల సాయంతో ఎదుర్కోవాలని సమావేశంలో నిర్ణయించారు.

తల్లిదండ్రుల చెంతకు ఇంటర్ విద్యార్థి



తల్లిదండ్రులకు ఉదయకుమార్‌ను అప్పగించిన పోలీసులు

నరసన్నపేట: మండలం రెడ్డికిపేట సమీపంలోని యాతపేటకు చెందిన ఇంటర్ విద్యార్థి ఉదయకుమార్ క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 10న కాలేజీకి వెళ్తున్నట్లు ఇంటిలో చెప్పి బయటకు వచ్చిన ఉదయకుమార్ తర్వాత ఇంటికి చేరలేదు. దీంతో కంగారు పడిన తల్లిదండ్రులు పలు చోట్ల గాలించారు. ఫలితం లేక పోవడంతో నరసన్నపేట పోలీసులకు 11 తేదీన ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎంక్వైరీ చేయడంతో విశాఖలో ఉన్నట్లు గుర్తించి ఇంటికి క్షేమంగా చేర్చారు. ఇంటర్ చదివేందుకు తనకు ఇష్టం లేని కళాశాల్లో తల్లిదండ్రులు జాయిన్ చేశారని బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఉదయ కుమార్ తెలిపారు.

రోగులతో కొత్తూరు సీహెచ్‌సీ కిటకిట



రోగులతో కిటికిటలాడుతున్న కొత్తూరు సీహెచ్‌సీ

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం గురువారం రోగులతో కిటికిటలాడింది. కొత్తూరు, ఎన్‌ఎన్ కాలనీతో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు డయేరియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ధర్మాన కిశోర్ ప్రత్యేక శ్రద్ధతో రోగులకు సకాలంలో వైద్యం అందిస్తున్నారు. భామిని, సీతంపేట మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన హడ్డుబంగి, కాశీనగర్‌లతో పాటు పలు గ్రామాలకు చెందిన రోగులు కొత్తూరు సీహెచ్‌సీకి వైద్యం కోసం రావడంతో ఆస్పత్రి రోగులతో మరింత రద్దీగా కనిపిస్తోంది.

వలస మత్స్యకారుడు మృతి



మృతుడు చిన్న (ఫైల్)

రణస్థలం: మండలంలోని అల్లివలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు యజ్జల చిన్న(48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మత్స్యకారుడైన చిన్న ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ సమీపంలో అంగూల్ జిల్లాలో ఉయ్యాలలు, టోపీలు అమ్మడానికి వలస వెళ్లాడు. అక్కడ రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందాడని ఒడిశా పోలీసులు గ్రామానికి సమాచారం ఇచ్చినట్లు అల్లివలస సర్పంచ్ చీకటి యర్రయ్య తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది. ప్రమాదం ఎలా జరిగిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

బాలుడు అదృశ్యం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్ద మురహరిపురం గ్రామానికి చెందిన బొంగు సాయికుమార్ అదృశ్యమైనట్లు తండ్రి మోహనరావు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తండ్రి మోహనరావు తన భార్య సరస్వతితో గురువారం నందిగాం మండలం కొండపేట గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్లి, మళ్లీ తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద తన కుమారుడు సాయికుమార్ లేకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో, గ్రామా ల్లో వెతికారు. కుమార్తెను అడగ్గా తమ్ముడు పిన్ని వాళ్లింటికి వెళ్లాడని చెప్పడంతో, గ్రామంలోని మరదలు ఇంటికి వెళ్లి మోహనరావు వా కబు చేశాడు. మరదలు కూడా పిల్లాడు తన ఇంటికి రాలేదని చెప్పడంతో, మండలంలో బంధువుల ఇంటి వద్ద కూడా వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో చివరికి గురువారం సాయంత్రం వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్ ఎక్కడైనా కనబడితే 81792 32243, 9866645096 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరారు.

ఎట్టకేలకు..!



లోక్‌సేవా భవన్ ఆవరణలో బాధ్యతలు నిర్వహిస్తున్న పాత్రికేయులు

- లోక్‌సేవా భవన్‌లోకి జర్నలిస్టులకు అనుమతి

భువనేశ్వర్: దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత బుధవారం సాయంత్రం వివిధ మీడియా సంస్థల జర్నలిస్టులను వార్తలను కవర్ చేసేందుకు లోక్‌సేవ భవన్‌లోకి అనుమతించారు. మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలోని కొత్త బీజేపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన కొన్ని గంటల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. కొత్త ప్రభుత్వం సత్వర చర్యపై పాత్రికేయ వర్గం సంతోషం వ్యక్తం చేసింది. తాజా చర్యతో కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

నిషేధించిన గత ప్రభుత్వం

రాష్ట్ర సచివాలయంలోకి జర్నలిస్టుల ప్రవేశాన్ని నియంత్రించడం గత బిజూ జనతా దళ్ ప్రభుత్వం చేసిన పెద్ద తప్పిదంగా మిగిలిపోయింది. కొత్త భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని గంటల స్వల్ప వ్యవధిలో ప్రవేశంపై ఆంక్షలు తొలగించి జర్నలిస్టులను అనుమతించింది. పాత్రికేయుల ప్రవేశం నిషేధించిన తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సుదీర్ఘ, సుస్థిర పాలన పగ్గాలు చేపట్టిన బీజేడీ సర్కారు కుప్ప కూలడం గమనార్హం. ప్రభుత్వ పోకడ, దైనందిన కార్యకలాపాలను ప్రజలకు తెలియజేయడం స్వచ్ఛమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలుస్తుంది. పాత్రికేయులను అడ్డుకోవడం ప్రజల్ని ప్రభుత్వ కార్యకాలాపాల నుంచి దూరం చేసినట్లే అయి బీజేడీ జన సంపర్కం క్రమంగా దూరమైన అధికా రం కోల్పోయినట్లు స్పష్టం అయింది. 2020 సంవత్సరంలో కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో లోక్ సేవా భవన్‌లోకి జర్నలిస్టుల ప్రవేశంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అనంతరం మహమ్మారి తొలగిపోయినా పాత్రికేయుల ప్రవేశంపై ప్రభుత్వం జారీ చేసిన ఆంక్షలను తొలగించకుండా ఏకపక్ష ధోరణితో చలామణి అయింది. ఈ పరిస్థితిని తొలగించాలని లోగడ పలు సార్లు ప్రధాన విపక్షం హోదాలో బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు గతంలో పలు సందర్భాల్లో పలు మార్లు సభలో చేసిన డిమాండ్‌ని అధికార అహంకారంతో బీజేడీ సర్కారు పెడ చెవి వైఖరి ప్రదర్శించింది. లోక్‌సేవా భవన్‌లోనే కాదు, అసెంబ్లీలోని ప్రెస్ గ్యాలరీలోకి కూడా జర్నలిస్టులను రానీయకుండా అప్పటి ప్రభుత్వం నిషేధించింది.

రొజ్జొ సందడి ప్రారంభం



పిఠా ఆన్ వీల్స్ రథాలు ప్రారంభిస్తున్న దృశ్యం

- పంథ నివాస్‌లో రొజ్జొ మహోత్సవ్

భువనేశ్వర్: మహిళల పండగ రొజ్జొ సందడి ఆరంభం అయింది. బాలికలు, యువతులు, మహిళలు ఈ పండగని ప్రత్యేకంగా జరుపుకోవడం విశేషం. ఈ సందర్భంగా స్థానిక ఒడిశా పర్యటన అభివృద్ధి సంస్థ (ఓటీడీసీ) ప్రధాన కార్యాలయంలో రొజ్జొ మహోత్సవ్ 2024 ప్రారంభించారు. ఆడపిల్లలు, యువతుల కోసం ఊయలలు, పారాణి (గోరింట), మెహందీ రొజ్జొ వేడుకల్లో ప్రధానమైనవి. వీటితో ప్రామాణికమైన ఒడియా వంటకాలది అగ్రస్థానమే. ఒడియా సంప్రదాయ రొజ్జొ వేడుకలతో వంటకాలను ప్రచారం చేసేందుకు ఓటీడీసీ ఏటా 3 రోజుల పాటు రొజ్జొ మహోత్సవ్‌ను నిర్వహిస్తుంది. ఈ ఉత్సవాన్ని స్థానిక పార్లమెంటు సభ్యురాలు అపరాజిత షడంగి, ఏకామ్ర భువనేశ్వర్ ఎమ్మెల్యే బాబూ సింగ్ ప్రారంభించారు. మూడు రోజుల పండుగలో భాగంగా ఓటీడీసీ నిర్వహించే అన్ని అతిథి కేంద్రాల్లో రొజ్జొ వంటకాలు, మిఠాయిల అమ్మకాలు జరిగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు డైరెక్టర్ సచిన్ రామచంద్ర జాదవ్ తెలిపారు. పండుగ సందర్భంగా ఈ ప్రాంగణాలు సందర్శించే మహిళల అరచేతులను ఉచితంగా గోరింటతో అలంకరిస్తారని తెలిపారు. స్థానిక పంథనివాస్ ప్రాంగణంలో సాంప్రదాయ ఊయలలు ఏర్పాటు చేశారు. మెహందీ కళాకారులతో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు.

పిఠా ఆన్ వీల్స్ ప్రారంభం

వేడుకను ఘనంగా నిర్వహించేందుకు రొజ్జొ రుచికరమైన పదార్థాల విక్రయానికి 3 పిఠా ఆన్ వీల్స్ రథాలను ప్రారంభించారు. నగరంలో మాస్టర్ క్యాంటీన్, కిట్ స్క్వేర్, ఐటీఈఆర్ – ఖండగిరి వద్ద 3 రోజులపాటు నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు రుచికరమైన పండి వంటలను ఈ రథాల్లో విక్రయిస్తారు. పిఠా ఆన్ వీల్స్ సంబల్‌పూర్, సిల్వర్ సిటీ కటక్ బోట్‌క్లబ్, ఐఎస్‌బీటీ కేఫ్, స్థానిక నిమంత్రణ్ రెస్టారెంట్‌లో రొజ్జొ పిఠా (మిఠాయిలు) కేంద్రాల్లో 2024 జూన్ 14 నుంచి జూన్ 16 వరకు ప్రజలకు విక్రయిస్తారు. కార్యక్రమంలో ఓటీడీసీ డైరెక్టర్ సచిన్ రామచంద్ర జాదవ్, జనరల్ మేనేజర్ డాక్టర్ లలాటేందు సాహు, ఉత్కళ్ పర్యటన్ నిగమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బేణుధర పాత్రో తదితరులు పాల్గొన్నారు.



రొజ్జొ ఊయలలో ఎంపీ అపరాజిత షడంగిని ఊపుతున్న ఏకామ్ర భువనేశ్వర్ ఎమ్మెల్యే బాబూ సింగ్

మంత్రి నిత్యానందకు శుభాకాంక్షలు



మంత్రి నిత్యానంద గోండోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన మంత్రి నిత్యానంద గోండోకి బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్ర రాజధానిలో గోండో వద్దకు వెళ్లి సంతోషం వ్యక్తం చేశారు. కొలువుదీరిన కొత్త రాష్ట్ర ప్రభుత్వంలో అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి కేవలం నిత్యానంద గోండోకి మాత్రమే మంత్రి పదవి దక్కింది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన పలువురు బీజేపీ అభినందనలు తెలుపుతున్నారు.

అన్న సంతర్పన



అన్న సంతర్పణ జరుగుతున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ రాజువీధిలో ఉన్న గణేష్ దేవాలయ ప్రతిష్ఠ సందర్భంగా అన్న సంతర్పణ జరిగింది. బుధవారం దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరంలో భారీగా వితరణ చేశారు. ఈ దేవాలయ ప్రాంగణంలోని అయ్యప్ప, గణేష్, కార్తికేయ దేవాలయాలకు శిఖర ప్రతిష్ఠ, ఆలయ ముఖ ద్వారం ప్రారంభం, సమావేశ మందిర నిర్మాణాల పూర్తి సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో..!

- శాఖలపై కొత్త మంత్రుల్లో ఆసక్తి
- మంత్రుల్లో 8 మంది తొలిసారి ఎన్నిక

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ నూతన మంత్రివర్గం కొలువుదీరింది. సర్కారియా కమిషను సిఫారసు మేరకు మంత్రి మండలిలో సభ్యులను ఖరారు చేసి ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. తదుపరి కార్యాచరణపై వీరందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. వీరికి కేటయించబోయే శాఖలపై ఉత్సాహపడుతున్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జనతా మైదాన్‌లో ముఖ్యమంత్రితో పాటు ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, ఎనిమిది మంది కేబినెట్ మంత్రులు, స్వతంత్ర బాధ్యతలు కలిగిన 5 మంది రాష్ట్ర మంత్రులు అత్యంత అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు.

స్పీకర్‌గా సురమా పాఢి..?

కొత్త మంత్రుల శాఖలపై చర్చ ఊపందుకుంటున్న తరుణంలో మంత్రి మండలిలో స్థానం లభించని రొణొపూర్ నియోజవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సురమా పాఢికి సర్వోన్నత స్థానం కల్పించేందుకు కొత్త మంత్రి మండలి యోచిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర అసెంబ్లీ తదుపరి స్పీకర్‌గా సురమా పాఢి ప్రత్యక్షం కానున్నట్లు తెలుస్తోంది. అలాగే ముఖ్యమంత్రి అధీనంలో కీలకమైన శాఖలు ఉంటాయని భావిస్తున్నారు. హోం, సాధారణ పరిపాలన మరియు ప్రజాభియోగాల వంటి ముఖ్యమైన శాఖలను ముఖ్యమంత్రి తన వద్దే ఉంచుకునే అవకాశం ఉందని పరిశీలకుల అంచనా. అదేవిధంగా ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడాకు కొన్ని కీలక శాఖలు లభించే అవకాశం ఉంది. కనక్ వర్ధన్ లోగడ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన అనుభవం కలిగి ఉన్నారు. ప్రభాతి పరిడా మాత్రం తొలిసారిగా రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రితో సహా 16 మంది సభ్యులతో కూడిన మంత్రి మండలిలో ఒక మహిళ, 3 మంది షెడ్యూల్డ్ తెగలు, 2 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు ఉన్నారు. 16 మంది సభ్యుల్లో 8 మంది తొలిసారి ఎమ్మెల్యేలు.

ప్రాంతీయ సమతుల్యతకు పెద్దపీట

మంత్రి మండలి సభ్యులను ఎంపిక చేసే సమయంలో బీజేపీ ప్రాంతీయ సమతుల్యత పరిరక్షణకు ప్రయత్నించింది. దక్షిణ ఒడిశా ప్రాంతంలోని అత్యధిక జనాభా కలిగిన జిల్లా గంజాం జిల్లా 13 స్థానాల్లో 11 స్థానాలను బీజేపీ కైవసం చేసుకుని బీజేడీ కంచుకోటని కుప్పకూల్చింది. దీంతో ఈ జిల్లాకు చెందిన ఇరువురు సభ్యులకు మంత్రి పదవులు లభించాయి. బిభూతి జెనాకు కేబినెట్ హోదా కల్పించగా, స్వతంత్ర బాధ్యతతో గోకులానంద మల్లిక్‌కు సహాయ మంత్రిగా పట్టం గట్టారు. నవరంగ్‌పూర్ జిల్లాకు చెందిన గిరిజన నాయకుడు ఉమర్‌కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండ్‌ను చేర్చుకోవడంతో దక్షిణ ప్రాంతానికి మరో క్యాబినెట్ బెర్త్ లభించింది. ఉప ముఖ్యమంత్రిగా కనక వర్ధన్ సింగ్‌దేవ్ పశ్చిమ ఒడిశాలోని బొలంగీర్ జిల్లాకు చెందిన వ్యక్తి కాగా, ముఖేష్ మహాలింగ్‌ను చేర్చుకోవడంతో జిల్లాకు మరో క్యాబినెట్ బెర్త్ లభించింది. బీజేపీకి కంచుకోటగా పేరొందిన పశ్చిమ ఒడిశా నుంచి మరో 2 మందికి కేబినెట్ మంత్రి పదవులు లభించాయి. వీరిలో సురేష్ పూజారి (బ్రజారాజ్‌నగర్), రబీ నారాయణ్ నాయక్ (కుచిండా) ఉన్నారు. కోస్తా ఒడిశా నుంచి పార్టీ ప్రభాతి పరిడాను ఉప ముఖ్యమంత్రిగా ఎంపిక చేయడంతో మంత్రివర్గంలో గణనీయమైన ప్రాతినిధ్యం కల్పించింది. చిలికా శాసనసభ్యుడు పృథ్వీరాజ్ హరిచందన్ కొత్త మంత్రి మండలిలో కేబినెట్ మంత్రిగా, పారాదీప్ ఎమ్మెల్యే సంపద్ చంద్ర స్వంయి రాష్ట్ర మంత్రిగా (స్వతంత్ర బాధ్యత) ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా మొత్తం తొమ్మిది ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్న మయూర్‌భంజ్ జిల్లాలో ఇద్దరు మంత్రులను నియమించారు. మొరొడా ఎమ్మెల్యే కృష్ణ చంద్ర మహాపాత్రోకు కేబినెట్ హోదా లభించగా, జషీపూర్ ఎమ్మెల్యే గణేష్ రాం సింగ్ ఖుంటియాకు స్వతంత్ర బాధ్యతతో కూడిన సహాయ మంత్రి పదవి లభించింది. జాజ్‌పూర్ మరియు ఢెంకనాల్ వంటి జిల్లాలకు కూడా మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించడం విశేషం.

మంత్రులంతా పట్టభద్రులే

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ కొలువులో మంత్రులందరూ పట్టభద్రులు కావడం విశేషం. ధామ్‌నగర్ ఎమ్మెల్యే సూరజ్ సూర్యవంశీ అతిపిన్న వయస్కుడైన మంత్రి కాగా, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ పెద్దవాడు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిదా, కేబినెట్ మంత్రులు సురేష్ పూజారి, పృథ్వీరాజ్ హరిచందన్, బిభూతి భూషణ్ జెనా మరియు డాక్టర్ కృష్ణ చంద్ర మహాపాత్రో తొలిసారి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. ఎనిమిది మంది కేబినెట్ మంత్రుల్లో నలుగురికి మాత్రమే శాసన సభలో గత అనుభవం ఉంది. రబీనారాయణ్ నాయక్, నిత్యానంద గోండ్, కృష్ణ చంద్ర పాత్రో మరియు ముఖేష్ మహాలింగ్‌లకు మాత్రమే గతంలో విధాన సభలో అనుభవం ఉంది. కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన 5 మంది రాష్ట్ర మంత్రుల్లో (స్వతంత్ర బాధ్యతలు) ముగ్గురు కొత్తవారు. ప్రదీప్ బాల సమంత్, గోకులానంద మల్లిక్ మరియు సంపద్ చరణ్ స్వంయి తొలిసారిగా విధానసభకు ఎన్నిక కాగా, గణేష్ రామ్ సింగ్ ఖుంటియా మరియు సూరజ్ సూర్యవంశీ గతంలో శాసన సభలో పని చేసిన అనుభవం కలిగి ఉన్నారు.

పాండిచ్చేరిలో వలస కార్మికుల ఇబ్బందులు



కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న బాధితుల కుటుంబ సభ్యులు

- వేతనాలు ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులు
- స్పందించిన జిల్లా కార్మిక శాఖ
- చర్యలు తీసుకుంటామని యజమానికి హెచ్చరిక

రాయగడ: ఉపాధి కోసం కేరళ రాష్ట్రానికి వెళ్లిన రాష్ట్రానికి చెందిన 12 మంది వలస కార్మికులు కంపెనీ యాజమాన్యం నిరంకుశ వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలసరి వేతనాలు ఇవ్వడం లేదు సరికదా, నానా హింసలు పెడుతున్నాడని వలస కార్మికులు తమ కుటుంబీకులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఎలాగైనా తమను రక్షించి స్వగ్రామానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని వలస కార్మికులు వేడుకున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు జిల్లా అదనపు కార్మిక శాఖ అధికారి సంజయ్ కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.

దళారిని నమ్మి వెళ్తే...

ఈ ఏడాది జనవరిలో కాసీపూర్ సమితి పొడాపడి పంచాయతీలోని ముండాగా గ్రామానికి చెందిన లొహర బిడిక, బుదాయి జొడియా, నరసింహ జొడియా, అపంజ చందన్ జొడియా, పింటు జొడియా, ముదాయి జొడియా, అరహిత్ లహర, కార్తీక్ జొడియా, పింకు జొడియా, శంకర్ జొడియా, మున్నా జొడియాలు ఉపాధి కోసం కేరళ రాష్ట్రానికి వెళ్లారు. వారు ఉపాధి కోసం వెదుకుతున్న సమయంలో గ్రామానికి సమీపంలోని శిలాపొదొరొ గ్రామానికి చెందిన సీమా ప్రధాన్ అనే దళారి ఉపాధి కల్పిస్తామని, నెలకు రూ.10 వేల వేతనంతో పాటు అన్ని వసతులు ఉచితంగా కల్పిస్తానని నమ్మించి పాండిచ్చేరిలోని మనేశ్వర్ అనే మార్వల్ కంపెనీలో చేర్పించాడు. దీంతో అతని మాటలు నమ్మి వీరంతా మార్వల్ జనవరిలో కంపెనీలో చేరారు. అయితే ఉద్యోగంలో చేరి నెలలు గడుస్తున్నా వీరికి కంపెనీ వేతనాలు ఇవ్వకపోవడంతో అనుమానించి కంపెనీ యజమానిని నిలదీశారు. దీంతో యజమాని ఎటువంటి సమాధానం ఇవ్వకపోగా నానా ఇబ్బందులు పెడుతుండేవాడు. ఆవేదన చెందిన బాధిత వలస కార్మికులు ఈ విషయాన్ని తమ కుటుంబీకులకు ఫోన్ ద్వారా బుధవారం తెలియజేశారు. వినతిపత్రం తీసుకున్న కార్మిక శాఖ అధికారి ఈ మేరకు స్పందించి పాండిచ్చేరి మార్వల్ కంపెనీ యజమానితో సంప్రదించారు. లేదంటే జిల్లా యంత్రాంగం తరుపున చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. స్పందించిన యజమాని వారి జీతాలను సెటిల్ చేసి జూన్ చివరి నాటికి వారిని పంపిస్తామని హామీ ఇచ్చారు.

అత్యాచార ఆరోపణతో యువకుడు అరెస్టు



అరెస్టైనన నిందితుడు గోపాల్ నాయిక్

జయపురం: ఒక మైనర్ బాలికను అపహరించి అత్యాచారం చేశాడనే ఆరోపణతో జయపురం మహిళా పోలీసులు ఒక యువకుడిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి స్థానిక బెడాసాహికి చెందిన గోపాల నాయిక్‌గా పేర్కొన్నారు. గోపాల్‌కు ఇది వరకే వివాహం అయ్యిందని మహిళా పోలీసు అధికారి అనిత కుజుర్ గురువారం వెల్లడించారు. నిందితుడిని కోర్టుకు పంపామని, అతనికి బెయిల్ మంజూరవ్వకపోవడంతో జైలుకు తరలించినట్లు తెలిపారు. పోలీసు అధికారి వివరణ మేరకు.. జయపురం సమితికి చెందిన 17 ఏళ్ల బాలికతో నాలుగేళ్ల నుంచి గోపాల్‌కు పరిచయం ఉంది. వారిరువురి మధ్య ప్రేమ బంధం ఏర్పడింది. దీంతో ఈనెల 5వ తేదీన గోపాల్ ఆ బాలికకు ఫోన్ చేశాడు. ఆ రాత్రి అతడు బాలిక గ్రామానికి వెళ్లాడు. అనంతరం బాలికను బైక్‌పై అపహరించుకుపోయి స్థానిక పారాబెడలోని ఒక ఇంటిలో ఉంచాడు. ఆ బాలిక వ్యతిరేకించినా అతడు ఆమెపై అత్యాచారం జరిపాడని, రెండు రోజుల తర్వాత అతడు జయపురం ప్రధాన ట్రాఫిక్ వద్ద ఆ బాలికను వదిలి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తమ కుమార్తె కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు అన్నిచోట్ల వెతికారు. చివరికి ట్రాఫిక్ కూడలి వద్ద ఉందని తెలిసి అక్కడికి వెళ్లి ఇంటికి తీసుకొచ్చారు. దీంతో ఆ బాలిక జరిగిన అన్ని విషయాలు వారికి తెలిపింది. వెంటనే వారు మహిళ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఆ బాలిక వద్ద వాగ్మూలం నమోదు చేశారు. నిందితుడు గోపాల్‌ను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

రథయాత్ర సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రైతా తదితరులు

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా అధ్యక్షతన రథయాత్ర సన్నాహక సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పట్టణ ప్రముఖులు దుర్గా ప్రసాద్ పండ, సునీల్ పండ, రంజన్ కుమార్ రొథొలతో పాటు తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, జిల్లా విద్యాశాఖ అధికారి బసంత కుమార్ సాహు, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. జులై 7వ తేదీన జరగనున్న రథయాత్రకు ఇప్పటికే రథ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని తహసీల్దార్ ప్రియదర్శిని వివరించారు. ఇదిలా ఉండగా గతేడాది ఈ యాత్ర నిర్వహణకు సంబంధించి రూ.19,87,084లు ఆదాయం విరాళాల రూపంలో సమకూరిందని, గతేడాది ఆదాయ, ఖర్చుల వివరాల నివేదికను చదివి వినిపించారు. ఆదాయ సేకరణలో భాగంగా రోడ్లపై స్టాల్ కేటాయించడంతో వాటి రూపంలో రూ.4,55,500లు, భోగాల విక్రయంతో రూ.20,645లు సమకూరిందని వివరించారు. గతేడాది రథయాత్ర నిర్వహణకు రూ.14,46,977 ఖర్చు కాగా, మిగతా రూ.5,40,107లను బ్యాంకులో బ్యాంకులో డిపాజిట్ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది కూడా అదే తరహా ఆదాయం సమకూరేవిధంగా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

పటిష్ట ఏర్పాట్లు

ఇదిలా ఉండగా యాత్ర తొమ్మిది రోజులు భక్తులు దేవతామూర్తులను దర్శనం చేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలియజేసింది. అదేవిధంగా యాత్రరోజు, మారుయాత్ర రోజున భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందువల్ల గుండిచా మందిరం నుంచి జగన్నాథ మందిరం వరకు ప్రతీ కూడలిలో తాగునీటి సైకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రియదర్శిని తెలియజేశారు. ఈ ఏడాది కూడా రథయాత్రను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం



నుజ్జునుజ్జయిన బైకు



నేపాల్ బెద్రక మృతదేహం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మృతులు మునిగుడ పోలీస్‌స్టేషన్ పరిధి కర్మాజొడి గ్రామానికి చెందిన నేపాల్ బెద్రక (32), తెలంగాపాదొరొ పంచాయతీలోని పొట్టంగిపాదొరొ గ్రామానికి చెందిన చిముకి శిఖక(24), అంబొదల పోలీస్‌స్టేషన్ పరిధి శివపాదొరొ గ్రామానికి చెందిన కలియా సాహు(29)గా గుర్తించారు. ఐఐసీ సూర్య చంద్ర పాడి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం జార్సుగుడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి ఎదురుగా రెండు బైకులపై వస్తున్న వారిని బలంగా ఢీకొంది. దీంతో ఒక బైక్‌పై ఉన్న నేపాల్ బెద్రక, చిముకి శిఖకలు సంఘటన స్థలం వద్దే మృతి చెందగా, మరో బైకుపై ఈ ప్రమాదంలో చిక్కుకున్న కలియా సాహు తీవ్రగాయాలకు గురై చికిత్సావస్థలో మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.



ప్రమాదానికి కారణమైన వ్యాన్

క్లుప్తంగా

కామాక్షమ్మా.. కరుణించమ్మా..

- ఘనంగా కామాక్షి అమ్మవార్ల దేవాలయం పంచమ వార్షికోత్సవం



భక్తుల పూజలందుకుంటున్న కామాక్షీదేవి

విజయనగరం: జ్యేష్ఠ శుద్ధ సప్తమి సందర్భంగా బొండాడ వీధిలో వేంచేసిన మహాగణపతి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు పర్యవేక్షణలో వేకువజాము నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, కలశస్థాపన, అర్చన, భూపుర శ్రీ చక్ర అలంకరణ, దేవి దేవతా మూర్తుల ఆవాహనం, మూలమూర్తులకు ప్రత్యేక వస్త్ర ఆభరణ అలంకరణ, సువాసినిలతో శ్రీచక్ర సహస్ర కుంకుమార్చన, లలితాపారాయణం, హరే శ్రీనివాస్ బృందం కోలాట ప్రదర్శన లు భక్తిశ్రద్ధలతో సాగాయి. సాయంత్రం కామాక్షి దే వి ఏకాంబరేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్స వం ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ లక్కోజు ఓంకార్ ఆచార్య సిద్ధాంతి వేదమంత్రాల సాక్షిగా జరిపించారు. అమ్మవారిని 108 చీరలతో అలంకర ణ చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి గౌరవాధ్యక్షుడు లోకనాథ గణపతి, ఉపాధ్యక్షుడు కాకినాడ శశిభూషణరావు, అలమండ పాపయ్య శాస్త్రి, మందరపు వరహాచారి, పురోహితులు మణికంఠ శాస్త్రి, ఆలయ అర్చకులు గంగాధారాచారి, వెంకటరమణాచారి పాల్గొన్నారు.

కుళాయిల ట్యాప్‌లు మాయం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఊటపల్లి పాఠశాల సిబ్బంది, ప్రజలు



ఆకతాయిలు దొంగిలించిన కుళాయిల ట్యాప్‌లు

మెరకముడిదాం: రోజురోజుకూ ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. మండలంలోని ఊటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి ట్యాపులు, మరుగుదొడ్ల ట్యాప్‌లు అపహరించడంతో పాటు పరిసరాలను చిందరవందర చేశారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణ చిందరవందరగా ఉండడం, ట్యాప్‌లు మాయం కావడం గమనించారు. వెంటనే బుధరాయవలస పోలీసులకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్ట్

పాలకొండ రూరల్: నగరంలోని గారమ్మకాలనీ శివారులో జూదమాడుతున్న ఏడుగురిని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అరెస్ట్ చేశారు. విజబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా శివారు ప్రాంతాల్లో గురువారం సాధారణ తనిఖీలు చేస్తుండగా పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వారి నుంచి 5,760 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



108 వాహనంలో క్షతగాత్రులు

రాజాం సిటీ: మండల పరిధి అంతకాపల్లి సమీపంలో గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గెడ్డకంచరాం గ్రామానికి చెందిన నక్క సత్యం తన పొలంలో పండిన కూరగాయలను రాజాంలో విక్రయించేందుకు అదే గ్రామానికి చెందిన నక్కిన దిలీప్‌కుమార్ ఆటోలో తరలిస్తున్నాడు. అంతకాపల్లి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎస్.కృష్ణంనాయుడు తెలిపారు.

‘సిరి’ధాన్యాలు

- చిరుధాన్యాలతో ఆరోగ్యంతో పాటు ఆదాయం
- సాగుకు ముందుకు వస్తున్న రైతులు
- వీటి ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్
- జిల్లాలో 800 హెక్టార్లలో సాగు



చోడి పంట



కొర్ర పంట

విజయనగరం ఫోర్ట్: ఆహారపు అలవాట్లలో మార్పులు రావడంతో ప్రజలు తక్కువ వయసులోనే వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఎటువంటి పోషకాలు లేని ఆహారాన్ని నేడు మనం తింటున్నాం. మన పూర్వీకుల విషయానికొస్తే అందుబాటులో ఉండే పౌష్టికాహారాన్ని తిని ఎంతో ఆరోగ్యంగా జీవించేవారు. వరి వంటి నీటి ఆధారిత పంటలు పండకపోయినా ఆరుతడి పంటలైన చోడి, ఊద, కొర్ర, సామ, వరిగ, ఆరికలు వంటి పంటలు సాగు చేసి ఆహార కొరత లేకుండా చేసుకునేవారు. ఇటువంటి చిరుధాన్యాలు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు తప్ప ఎటువంటి హాని ఉండదు. అయితే మారుతున్న కాలగమనంలో మళ్లీ చిరుధాన్యాలకు డిమాండ్ ఏర్పడింది. చిరుధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలను వైద్యులు, నిపుణులు వివరిస్తుండడంతో రైతులు కూడా వీటి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొంతమంది చిరుధాన్యాలను నేరుగా తింటుండగా.. మరి కొంతమంది చిరుధాన్యాలను పౌడర్‌గా చేసి అంబలి చేసుకుని తాగుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే నేటి తరం వారు కూడ మరలా పూర్వకులు తీసుకునే ఆహారం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. అది ఆరోగ్యకరంగా ఉండడం, వైద్యులు సైతం చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని చెప్పడంతో ఎక్కువ మంది తింటున్నారు. అయితే చిరుధాన్యాలు తక్కువ నీటితో పండించవచ్చు. అంతేకాకుండా అధిక దిగుబడి కూడా వస్తుంది.

కొర్ర పంట..

ఎకరానికి 2 కిలోల విత్తనం సరిపోతుంది. ఈపంట ను ఖరీఫ్‌లో జూన్, జూలై నెలల్లోను, వేసవిలో అయితే జనవరి నెలలో వేసుకోవాలి. తేలికపాటి, నల్లరేగిడి నేలలో పండించవచ్చు.

కొర్రలో రకాలు..

ప్రసాద్ రకం 70 నుంచి 75 రోజుల్లో పండుతుంది. కృష్ణదేవరాయ రకం 80 నుంచి 85 రోజుల్లో పండుతుంది. నరసింహా, శ్రీ లక్ష్మి రకాలు కూడా 80 నుంచి 85 రోజుల్లో పండుతాయి.

ఎరువులు

ఎకరాకు 20 కిలోల నత్రజని, 30 కిలోల పొటాష్ వేయాలి. పంట సాగు చేయడానికి ముందు రెండు టన్నుల పశువుల గత్తాన్ని వేయాలి.

సామలు

ఈపంటకు తేలికపాటి ఎర్రటి ఇసుక నేలలు అనుకూలం. ఈ పంటను జూన్, జూలై నెలల్లో విత్తుకోవాలి. విత్తనం వరుసలో వేయటకు రెండు కిలోలు, వెద జల్లుటకు ఐదు కిలోల విత్తనాలు అవసరం.

ఎరువులు: నత్రజని ఎరువులు 10 కిలోలు, భాస్వరం 10 కిలోలు, పొటాష్ 10 కిలోలు వేసుకోవాలి. పశువుల గత్తం 2 టన్నులు విత్తడానికి ముందు ఎకరానికి వేసుకోవాలి.

విత్తన రకాలు: కో-2, బీఎల్‌ఎం 203 రకాలు. ఈ రకాలు 80 నుంచి 85 రోజుల్లో పండుతుంది. బీఎల్‌ఎం-36 ,బీఎల్‌ఎం-26 రకాలు 90 నుంచి 100 రోజుల్లో పండుతాయి.

ఊదలు..

ఈ పంటను జూన్, జూలై నెలల్లో వేసుకోవాలి. వరుసలలో వేయడానికి ఎకరానికి రెండు కిలోలు, వెదలకు ఐదు కిలోల విత్తనం అవసరం.

ఎరువులు..

విత్తనం వేయడానికి ముందు రెండు టన్నుల పశువుల గత్తం వేసుకోవాలి. సాగు చేపట్టిన తర్వాత 10 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్, 10 కిలోల భాస్వరం ఎరువులు వేసుకోవాలి.

విత్తన రకాలు: వీఎల్-230 రకం 90 రోజుల్లో పంటకు వస్తుంది. వీఎల్-172 రకం 90 నుంచి 95 రోజుల్లో పండుతుంది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటాయి.

వరిగలు

ఈ పంటను కూడా జూన్, జూలై మాసాల్లో విత్తుకోవాలి. వరుసలలో విత్తుకోవాడానికి కిలో విత్తనం, వెద జల్లుకోవాడానికి మూడు కిలోల విత్తనం సరిపోతుంది.

ఎరువులు: విత్తనం వేయడానికి ముందు పశువులు గత్తం రెండు టన్నులు వేయాలి. సాగు చేపట్టిన తర్వాత 10 కిలోల పొటాష్, 10 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

విత్తన రకాలు

టీఎన్, ఏయూ 145 రకాలు 75 నుంచి 80 రోజుల్లో పండుతాయి. జేపీయూ పి రకం 70 నుంచి 75 రోజుల్లో పండుతాయి. వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటాయి.

చోడి..

ఈ పంటను ఖరీఫ్‌లో అయితే జూలై , ఆగస్టు నెలల్లో.. రబీలో నవంబర్, డిసెంబర్ నెలల్లో .. వేసవిలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో విత్తుకోవాలి.

రకాలు..

హిమ: ఇది తెల్ల చోడి రకం. అగ్గి తెగులను తట్టుకుట్టుంది. 105-110 రోజుల్లో పండుతుంది.

శ్రీచైతన్య: ఖరీఫ్‌లో వేసుకోవాలి. 110 నుంచి 115 రోజుల్లో పండుతుంది.

ఎరువులు

ఎకరానికి నాలుగు టన్నుల పశువుల ఎరువు ఆకిరి దుక్కిలో వేసి కలియ దున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని , 12 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ నాటేటప్పుడు వేయాలి. నాటిన 30 రోజులకు మరో 12 కిలోల నత్రజని పైపాటుగా వేయాలి.

చిరుధాన్యాల్లో ఉండే పోషకాల వివరాలు..	
పోషకాలు	క్యాలరీలు (గ్రాముల్లో)
పీచు పదార్థాలు	64.16
ప్రోటీన్	14.12
సోడియం	5
కాల్షియం	47
ఐరన్	4.57
మెగ్నిషయం	197 మిల్లీ గ్రాములు
భాస్వరం	457 మిల్లీ గ్రాములు

తక్కువ నీటితో పంటలు..

చిరుధాన్యాల సాగుకు తక్కువ నీరు సరిపోతుంది. ఆడపా, దడపా వర్షాలు కురిసినా పంట చేతి కొస్తుంది. చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ప్రతిఒక్కరూ వీటిని తినడానికి ఆసక్తి చూపుతున్నారు.

వి. తారకరామారావు, జిల్లా వ్యవసాయాధికారి

ప్రమాదకర ప్రయాణం



ఇద్దరు ప్రయాణించేందుకు వీలుపడే బండిపై నలుగురు ప్రయాణించడాన్ని చూసిన వారు గగుర్పాటుకు గురయ్యారు. ఈ ప్రయాణం ప్రమాదకరం మిత్రమా అంటూ పలువురు సలహా ఇచ్చారు. అయితే, యువకులు మాత్రం వారి మాటలు పట్టించుకోకుండా విజయనగరం పట్టణంలోని మూడులాంతర్ల కూడలిలో గురువారం ఇలా ప్రమాదకర రీతిలో ముందుకు సాగిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పక్షపాతం తగదు...



ఉపాధిహామీ కార్యాలయం ముందు బైఠాయించిన వేతనదారులు

- ఉపాధి అధికారుల తీరును తప్పుబట్టిన నరసాపురం వేతనదారులు
- కార్యాలయాన్ని ముట్టడించి నిరసన

రామభద్రపురం: మేట్‌ల ఫోన్‌లలో వేతనదారుల మస్టర్లకు సంబంధించిన యాప్‌లను తొలగించడంతో పాటు తాము వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమనే ఉద్దేశంతో ఉపాధి అధికారులు పక్షపాతం చూపిస్తున్నారని మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వేతనదారులు ఆరోపించారు. ఈమేరకు గురువారం స్థానిక ఉపాధి కార్యాలయాన్ని ముట్టడించారు. వివరాల్లోకి వెళితే... రెండేళ్లుగా ఆ గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో వేతనదారుల మస్టర్లు, ఫేస్ అథెంటికేషన్ వేసే బాధ్యత నలుగురు సీనియర్ మేట్‌లకు అప్పగించారు. అయితే ఆ నలుగురులో ఇద్దరు వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కాగా మరో ఇద్దరు టీడీపీ మద్దతుదారులు. వీరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు సంబంధించి వారం రోజుల కిందట ఒకరి ఫోన్‌లో యాప్‌ను, తాజాగా గురువారం మరో మేట్ ఫోన్‌లో యాప్‌ను తొలగించారు. ఇద్దరి మేట్ల ఫోన్లలో యాప్‌లు తొలగించడంతో మస్టర్లు వేయడానికి ఇబ్బందులేర్పడుతుండడంతో సుమారు 150 మంది వేతనదారులు ఉపాధి కార్యాలయాన్ని ముట్టడించారు.



ఏపీఓ త్రినాథరావును చుట్టుముట్టిన వేతనదారులు

ఏపీఓ నిలదీత..

ఏపీఓ త్రినాథరావు కార్యాలయానికి చేరుకోగానే వారంతా ఆయన్ను చుట్టుముట్టారు. మీరే మేట్‌ల ఫోన్‌లలో ఉన్న యాప్‌లను తొలగించి, టీడీపీ వారికి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ కార్యాలయానికి చేరుకుని వేతనదారులకు సర్ది చెప్పారు. ఏ సమస్య ఉన్నా తాను స్వయంగా పరిష్కరిస్తానని చెప్పడంతో వేతనదారులు శాంతించారు. గ్రామానికి వెళ్లి వేతనదారులతో సమావేశమై సమస్య పరిష్కరించాలని ఏపీఓ త్రినాథరావును ఆదేశించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



దనపతి బాలకృష్ణ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని బూరుగ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దనపతి బాలకృష్ణ (38) చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఏఎస్సై కృష్ణంనాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈయనకు మద్యం అలవాటు ఉండడంతో తల్లి, భార్య ఎప్పటికప్పుడు మందలిస్తుండేవారు. ఈనెల 11న కూడా బాలకృష్ణ మద్యం మత్తులో ఇంటికి రావడంతో భార్య, తల్లి మందలించారు. దీంతో ఆయన చనిపోతానని కుటుంబ సభ్యులను బెదిరించి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గతంలో పలుమార్లు ఇలానే బెదిరించి ఇంటికి చేరుకోవడంతో.. ఈ సారి కూడా బాలకృష్ణ మళ్లీ ఇంటికి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే మరుచటి రోజు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న బాలకృష్ణను స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలకృష్ణను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పాలకొండ ఏరియా ఆస్పత్రికి, తర్వాత శ్రీకాకుళం జెమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాలకృష్ణ మృతి చెందాడు. మృతుడి తల్లి అన్నపూర్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కృష్ణంనాయుడు తెలిపారు. మృతుడికి భార్య భవానీ, ఇద్దరు పిల్లలు న్నారు.

మరో సైబర్ మోసం

- తెలియని వ్యక్తికి డబ్బులు చెల్లించి మోసపోయిన అర్చకుడు

విజయనగరం క్రైమ్:

సైబర్ మోసాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నా ఇంకా ప్రజల్లో చైతన్యం రావడం లేదు. ఆన్‌లైన్‌లో ఎవ్వరు డబ్బులు అడిగినా.. యాప్‌లు, లింక్‌ల ద్వారా ఏటీఎం, బ్యాంక్ ఖాతా సమాచారం కోరినా ఎవ్వరూ స్పందించవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఇంకా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా మరో ఆన్‌లైన్ మోసం వెలుగుచూసింది. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు గురువారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కోట వద్దనున్న మూడు కోవెళ్లలో పనిచేస్తున్న అర్చకుడు వేణు చిరంజీవి ఇన్‌స్టాగామ్‌లో వచ్చిన రవి యాదవ్ రిక్వెస్ట్‌ను యాక్సెప్ట్ చేశాడు. తాను ఒంగోలు ఆర్‌ఎంఎస్ మెడికల్ క్లబ్‌లో పనిచేస్తున్నానని.. తాను పంపించిన లింక్‌ను ఓపెన్ చేస్తే భారీగా డబ్బులు వస్తాయని రవియాదవ్ బాధితుడ్ని నమ్మించాడు. దీంతో అర్చకుడు వేణు చిరంజీవి మోసగాడు పంపించిన లింక్ ఓపెన్ చేసి అతడికి రూ. 1800, రూ.3000 చొప్పున మొత్తం రూ. 2.60 లక్షలు పంపించాడు. కొన్ని రోజులకు తాను మోసపోయానని గ్రహించిన అర్చకుడు మోసగాడికి ఫోన్ చేసి నిలదీయగా.. మరోసారి ఫోన్‌చేసినా, డబ్బులు అడిగినా చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు వేణుచిరంజీవి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానంతో పునర్జన్మ..

- అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించి ప్రాణదాతలుగా నిలుస్తున్న యువత
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రాజాం సిటీ: మనిషి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనిచ్చే రక్తదానం కంటే మించినది మరొకటి లేదు. ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ స్పందించి రక్తం దానం చేసి ప్రాణదాతలు కావచ్చు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు విడస్తున్నారు. అయితే ప్రస్తుతం సేకరిస్తున్న రక్తం నిల్వలు కూడా సరిపోవడం లేదు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో మేమున్నామంటూ కొంతమంది రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయం. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

ప్రాణంతో సమానం....

ప్రమాదాల్లో గాయపడిన వారికి, అత్యవసర చికిత్సలు అవసరమైన వారికి రక్తం ఎంతో అవసరం. రక్తాన్ని ఒకరి నుంచి మరొకరికి అందించాల్సిందే కానీ కృత్రిమంగా తయారుచేయలేం. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం అని చెబుతారు. ఒకరి రక్తం మరొకరి ఆయుష్షు కాపాడుతుంది. రక్తానికి పేద, ధనిక అనే భేదాలుండవు. ఒక మనిషి రక్తం మరో మనిషి ప్రాణాలు కాపాడుతుందని తెలిసినా చాలా మంది రక్తదానం చేయడానికి భయపడుతున్నారు. కొంతమంది మాత్రం ఎప్పుడు రక్తం అవసరం వచ్చినా మేమున్నామంటూ ముందుకొస్తున్నారు.

రక్తదానానికి వీరు అర్హులు....

- 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు, 50 కిలోల బరువు కలిగి ఆరోగ్యంగా ఉన్నవారు.
- హిమోగ్లోబిన్ శాతం 12.5 లోపున్నవారు.
- చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, ఇతర వ్యాధులు సోకిన వారు కోలుకున్న నాలుగు నుంచి ఆరు నెలల తర్వాత నుంచి రక్తదానం చేయవచ్చు.
- దాతల నుంచి కేవలం 300 మిల్లీ లీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.
- రక్తాన్ని సేకరించే ముందు వైద్యులు దాత ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు.



జీఎంఆర్ నైరేడ్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

వీరు అనర్హులు..

- మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు.
- కంటి జబ్బులు, కంటి కలక వంటివి ఉన్నప్పుడు రక్తదానం చేయవద్దు.

49 సార్లు రక్తదానం చేశా.....



ఇప్పటి వరకు శిబిరాల ద్వారా, స్వచ్ఛందంగా 49 సార్లు రక్తదానం చేశాను. ఆపదలో ఉన్న వారికి ఇలా ఉపయోగపడడం చాలా సంతోషంగా ఉంది. రక్తదానం చేయడం ద్వారా ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను. ఎవరికైనా ఏ సమయంలో అవసరమైనా రక్తం ఇచ్చేందుకు నేను సిద్ధం. త్వరలో 50వ సారి రక్తదానం చేయనున్నాను.

– శపతి రాము, రక్తదాత, పొగిరి.

యువత సహకారం అవసరం..



రక్త నిల్వలు పూర్తిగా తగ్గుముఖం పట్టకుండా ఉండాలంటే యువత సహకారం ఎంతైనా అవసరం. యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేయాలి. రక్తం అందక ఎవరూ చనిపోకూడదనే ఉద్దేశంతో యువతకు అవగాహన కల్పించి శిబిరాలు నిర్వహిస్తున్నాం. రక్తదానం కుటుంబ సంప్రదాయంలా మారాలి.

– పెంకి చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ సభ్యుడు, రాజాం.

ప్రతి ఏటా రక్తదాన శిబిరం ..



ఇది ఒక మహత్తరమైన కార్యక్రమం. ప్రతి ఏడాదీ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా అవగాహన కలిప్తున్నాం. గ్రామీణ ప్రాంత యువత అపోహలు వీడి ఎక్కువగా రక్తదానానికి ముందుకు రావాలి. అప్పుడే రక్తం కొరతను నివారించేందుకు అవకాశం ఉంటుంది.

– డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్, జీఎంఆర్ ఐటీ, రాజాం.

అపోహలు వీడాలి.......



రక్తదానం చేయడం వల్ల ఏదో అయిపోతుందనే అపోహలు వీడాలి. ఆరోగ్యవంతంగా ఉండి 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు. ఇప్పటివరకు పది సార్లు రక్తదానం చేశా. ఎటువంటి సమస్యలు తలెత్తలేదు. ప్రస్తుత తరుణంలో యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గార రవిప్రసాద్, ప్రముఖ వైద్యుడు రాజాం.

రైల్వే మూడో లైన్ పనుల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి-మరడాం మధ్యలో జరుగుతున్న రైల్వే మూడో లైన్ పనులను రైల్వే ఏజీఎం నర్సింగరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కిరండోల్ నుంచి విజయనగరం వరకు రైల్వే మూడో లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే చాలామేరకు పట్టాలు వేయడం పూర్తయిందన్నారు. కోమటిపల్లి వద్ద కొత్త రైల్వే స్టేషన్ పనులు నెలాఖరుకు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. గూడ్స్ షెడ్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే సిబ్బందికి సూచించారు.

జూట్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: జూట్ కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్ బకాయిలు చెల్లించకుండా కార్మికులను మోసంచేసిన శ్రీలక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్లు యజమాని కేవీఆర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, జిల్లా నాయకులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం 2020 ఫిబ్రవరి నాటికి పూర్తిస్థాయిలో పీఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల 50 ఏళ్లు దాటిని కార్మికులకు పెన్షన్లు కూడా రావడం లేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కార్మిక శాఖ అధికారులు స్పందించి కార్మికులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.